@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | గురువారం 04, ఏప్రిల్ 2024 | పేజీలు: 04



## చందాపూర్‌లో ఘోర ప్రమాదం

**సంగారెడ్డి జిల్లా హత్నూర ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో భారీ పేలుడు**

- పరిశ్రమ డైరెక్టర్ సహా.. ఐదుగురి దుర్మరణం
- మరో నలుగురు మృతిచెంది ఉంటారని అనుమానం
- 20 మందికి గాయాలు.. నలుగురు విషమం..
- భయంతో పరుగులు తీసిన కార్మికులు
- గవర్నర్ రాధాకృష్ణన్, సీఎం రేవంత్ దిగ్భ్రాంతి..

నేటి ఫోకస్ న్యూస్, హత్నూర, ఏప్రిల్ 3:

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం.. చందాపూర్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఎస్‌బీ ఆర్గానిక్ ఫ్యాక్టరీలో భారీ శబ్దంతో రియాక్టర్ పేలింది. పేలుడు ధాటికి కంపెనీలో పనిచేసే మేనేజర్ రవితోపాటు ఆరుగురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. మరో 10మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. రియాక్టర్ పేలుడుతో కార్మికులు వందల మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. మిగతా 2లో..



## ఇందిరమ్మ స్థానం మన ఖాతాలోకే..

**మెదక్ లోక్‌సభ నియోజకవర్గ సమీక్షలో సీఎం రేవంత్**

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్ 3:

దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంటు స్థానం ఈసారి కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకే రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని నేతలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు. అందరూ కలిసికట్టుగా పనిచేయడం ద్వారా మెదక్ స్థానంలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని స్పష్టం చేశారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మెదక్ లోక్‌సభ పరిధిలోని నేతలతో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖతోపాటు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, పార్టీ నేతలు కాటా శ్రీనివాస్‌గౌడ్, ఆవుల రాజిరెడ్డి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పూజల హరికృష్ణ, ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు. సమీక్షలో భాగంగా రేవంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని మిగతా 2లో..

## నాలుగు నెలలవుతున్నా రుణమాఫీ ఊసేది

- రైతులకు తక్షణమే రూ.2లక్షల రణమాఫీ
- ఆర్థిక భారంతో రైతుల్లో తీవ్ర ఆందోళన
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్3:

రైతులకు తక్షణమే రూ.2లక్షల రణమాఫీ చేయాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఆర్థిక భారంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుకున్నారని తెలిపారు. అందువల్ల రూ.2 లక్షల రుణమాఫీ ఎప్పట్లోగా చేస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే రైతు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించారని, నాలుగు నెలలవుతున్నా ఒక్క రైతుకు కూడా మాఫీ కాలేదని విమర్శించారు. రైతులకు బ్యాంకులు నోటీసుల మీద నోటీలు ఇస్తూ కిస్తీ చెల్లించాలంటున్నా యని, తీసుకున్న రుణాలకు వడ్డీ చెల్లించి తీరాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నాయని చెప్పారు.ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ లేఖ రాశారు. 'తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే డిసెంబర్ 9 నాడే 2 లక్షల రూపాయల రుణమాఫీ ఒకేసారి చేస్తామని మీరు ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష రూపాయల రుణమాఫీ పొందిన రైతులు కూడా మళ్లీ బ్యాంకులకు వెళ్లి 2 లక్షల రూపాయల రుణాలు తీసుకోవాలని మీరే స్వయంగా పిలుపునిచ్చారు. మీ మాటను నమ్మి రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్నారు. డిసెంబర్ 9 నాడు మీరు మిగతా 2లో..



## ఫోన్ ట్యాపింగ్ కాదు.. వాటర్ ట్యాప్‌లపై దృష్టిపెట్టండి



- తెలంగాణ వ్యాప్తంగా రోడ్డెక్కుతున్న మహిళలు
- మంచినీటి బిందెలతో నిరసనలు
- గొంతెడుతున్నా పట్టించుకోని కాంగ్రెస్
- మిషన్ భగీరథ నిర్వహించడం చేతకావడం లేదు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ విమర్శలు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్3:

తెలంగాణలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో గొంతు ఎండి మంచి నీళ్లు మహాప్రభో అంటున్నారని, నీటికోసం అల్లాడుతున్నారని.. మహిళలు బిందెలు పట్టుకుని తిరగాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో పరిస్థితి తలెత్తలేదని వెల్లడించారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, వివేకానందతో కలిసి హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తాగునీళ్లు లేక ప్రజలు, సాగునీళ్లందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇది ప్రకృతి ప్రకోపం వల్ల వచ్చిన కరువు కాదని, అసమర్థ కాంగ్రెస్ వల్ల వచ్చిన కరువని ఆగ్రహం వ్యక్తంచేశారు. నీళ్లు ఉన్నా వినియోగించడం ఈ ప్రభుత్వానికి చేతకవాడం లేదన్నారు. ఫోన్‌ట్యాపింగ్ మీద కాకుండా వాటర్ ట్యాప్ మీద దృష్టి పెట్టాలని హితవు పలికారు. చేరికల కోసం పార్టీ గేట్లు ఎత్తడం కాదు.. రైతుల కోసం ప్రాజెక్టుల గేట్లు ఎత్తండని ముఖ్యమంత్రికి సూచించారు. హైదరాబాద్‌లో నేడు ఎక్కడపడితే అక్కడ వాటర్ ట్యాంకర్లు కనిపిస్తున్నాయన్నారు. నగరంలో ట్యాంకర్ల దందా జోరుగా సాగుతున్నదని మిగతా 2లో..


## ఏనుగు దాడిలో రైతు మృతి

- ప్రాణహిత నది దాటి కొమురంభీం జిల్లాలోకి ప్రవేశించి...
- చింతలమానెపల్లి మండలం బూరెపల్లిలో ఘటన

నేటి ఫోకస్ న్యూస్, సిర్పూర్-ఏప్రిల్ 3:

ఏనుగు దాడిలో ఓ రైతు మృత్యువాత పడ్డాడు. మహారాష్ట్రలోని అటవీప్రాంతం నుంచి బుధవారం తెల్లవారుజామున ప్రాణహిత నది దాటి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం బూరెపల్లి సమీపంలోని వ్యవసాయ మిగతా 2లో..





## భారీ భూకంపం

- తొమ్మిది మంది దుర్మరణం
- 821 మందికి గాయాలు.. తీవ్రత 7.2
- కూలిన వంతెనలు.. ఒరిగిన భవనాలు
- శిథిలాల కింద 127మంది

నేటి ఫోకస్ న్యూస్, తైపీ, ఏప్రిల్ 3:

ద్వీపదేశం తైవాన్‌ను భారీ భూకంపం అతలాకుతలం చేసింది. తైవాన్ కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 8 గంటలకు సంభవించిన ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.2గా నమోదైంది. 1999 తర్వాత ఇదే అతిపెద్ద భూకంపం అని తైవాన్ వాతావరణ శాఖ తెలిపింది. హువాలియన్ తీరంలో తీవ్ర నష్టం సంభవించిందని.. తొమ్మిది మంది చనిపోగా, 821 మంది గాయపడ్డారని, మరో 127 మంది మిగతా 2లో..

# ఇందిరమ్మ స్థానం మన ఖాతాలోకే..

(మొదటి పేజీ తరువాయి..)

బీజేపీని కూడా ప్రజలు ఆదరించే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రచారాస్త్రాలుగా చేసుకుని ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని కోరారు. మెదక్ పార్లమెంటుపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పని చేయాలనీ, నేతలు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకోవడం ద్వారా పార్టీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

# చందాపూర్‌లో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి..)

బల్క్ డ్రగ్స్ పరిశ్రమలో రియాక్టర్లు పేలిన ఘటనలో ఐదుగురు దుర్మరణం పాలవ్వగా.. 20 మంది కార్మికులు తీవ్ర గాయాలపాయ్యారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో చోటుచేసుకుంది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికుల కథనం ప్రకారం.. ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో బుధవారం జనరల్ షిఫ్ట్ (ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30)లో అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సహా.. మొత్తం సుమారు 60 మంది విధులకు హాజరయ్యారు. ఈ పరిశ్రమలో బల్క్ డ్రగ్స్, ఫార్మా కంపెనీలకు కావాల్సిన గ్రాన్యూల్స్/పెల్లెట్స్ తయారు చేస్తారు. సాయంత్రం షిఫ్ట్ ముగిసే సమయంలో.. పరిశ్రమలోని రియాక్టర్లు ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోయాయి. ఆయిల్ బాయిలర్ వద్ద ఈ ఘటన జరగడంతో.. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. చూస్తుండగానే మంటలు వ్యాపించి దట్టమైన పొగ అలుముకుంది. ఈ ఘటనలో పరిశ్రమ డైరెక్టర్, వ్యవస్థాపక యజమానుల్లో ఒకరైన రవికుమార్(45), ప్రొడక్షన్ ఇన్‌చార్జులు సుబ్రమణ్యం(38), దయానంద్(46), మెయింటెనెన్స్ మేనేజర్ సురేశ్‌పాల్(45), చాకలి సురేశ్(35) అక్కడికక్కడే మృతిచెందారు. రవికుమార్ ఏపీలోని గుంటూరు జిల్లా గురజాలకు, సురేశ్‌పాల్ మధ్యప్రదేశ్‌కు, దయానంద్ తమిళనాడుకు, సుబ్రమణ్యం ఏపీకి చెందినవారు. మరో నలుగురు కార్మికులు కూడా మృతిచెంది ఉంటారని అగ్నిమాపక సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు. ఆ పరిసరాల్లో విధులు నిర్వర్తిస్తున్న, విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న 20 మంది కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. మంత్రులిద్దరూ సీఎం రేవంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, పరిస్థితిని వివరించారు.

**గవర్నర్, సీఎం దిగ్భ్రాంతి..**

ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో ప్రమాదం పట్ల గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని గవర్నర్ ఆదేశించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# పెన్షన్ల పంపిణీలో రాజకీయ రగడ

- పరస్పర విమర్శలతో వేడెక్కిన ఏపి రాజకీయం
- వలంటీర్లతో పంపిణీకి నిరకారించిన హైకోర్టు
- పెన్షనర్ల ప్రజాప్రయోజన వ్యాజ్యం కొట్టివేత

**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-ఏప్రిల్3:** ఏపీలో వాలంటీర్లతో పెన్షన్ పంపిణీ చేయించే విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులపై రాష్ట్రంలో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అదే సమయంలో వాలంటీర్లతో పెన్షన్ల పంపిణీ వీలుకాకపోవడంతో పింఛన్ దారుల ఇబ్బందులు దారుణంగా ఉన్నాయి. మరోవైపు ఈసీ ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ పై విచారణ జరిపిన హైకోర్టు.. దాన్ని కొట్టేసింది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో అధికార వైసీపీకి అనుకూలంగా ఉన్న వాలంటీర్లతో పెన్షన్లు పంపిణీ చేయించకుండా సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంస్థ చేసిన విజ్ఞప్తిపై హైకోర్టు గతంలో ఈసీకి ఆదేశాలు ఇచ్చింది. వీటి ఆధారంగా ఈసీ కూడా వాలంటీర్లను పెన్షన్ల పంపిణీకి వాడొద్దని ఆదేశాలు ఇచ్చింది. వీటిని సవాల్ చేస్తూ హైకోర్టులో పలువురు పెన్షనర్లు ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. పిల్ ను కొట్టేసింది. ఇలా ఎన్నికలకు ముందుకు ఏపీ సర్కారుకు హైకోర్టులో ఊహించని షాక్ తగలింది. ఏపీలో వలంటీర్ల ద్వారా పెన్షన్లు పంపిణీని నిలువరిస్తూ ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. వలంటీర్లు వ్యవస్థ లేని ఇతర రాష్ట్రాల్లో కూడా పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు కదా అని వాఖ్యానించారు. వలంటీర్లపై వచ్చిన ఫిర్యాదులు పరిగణలోకి తీసుకొని ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకొంది. ఈసీఐ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్ళలేని వారికి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్లు ఇంటి వద్దకు వెళ్ళి అందజేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చింది. సజావుగా పెన్షన్ల పంపిణీకి ఈసీఐ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్న నేపథ్యంలో పిల్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. వలంటీర్లతో సామాజిక పింఛన్లు పంపిణీ చేయించొద్దని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల విధుల నుంచి వలంటీర్లను దూరంగా ఉంచాలని మరోసారి స్పష్టం చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాలను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లను పెన్షన్ పంపిణీ కార్యక్రమం నుంచి దూరం పెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించినట్లు వెల్లడించారు. వలంటీర్ల ద్వారా లబ్దిదారులకు ఎటువంటి పథకాలు, పింఛన్, నగదు పంపిణీ చేయకూడదని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్ర ఎన్నికల సంఘం సీఈవోకు పంపిన ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఎన్నికల కోడ్ ముగిసే వరకు వలంటీర్లకు ఇచ్చిన ట్యాబ్, మొబైల్‌తో పాటు ఇతర ఉపకరణాలు కలెక్టర్ల వద్ద డిపాజిట్ చేయించాలని ఈసీ ఆదేశించినట్లు మీనా తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం కొనసాగిస్తున్న పథకాలను, నగదు పంపి ణీ పథకాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా, ప్రత్యేకించి ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా అమలు చేయాలని ఈసీ సూచించినట్లు ముఖేశ్ కుమార్ మీనా వెల్లడించారు. దీనిపై వైసీపీ ప్రభుత్వం కోర్టును ఆశ్రయించింది. కోర్టు కూడా ఈసీఐ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్న నేపథ్యంలో పిల్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

# ఫోన్ ట్యాపింగ్ కాదు.. వాటర్ ట్యాప్‌పై దృష్టి పెట్టండి




(మొదటి పేజీ తరువాయి..)

విమర్శించారు. మూడు, నాలుగు రెట్లు అధికంగా చెల్లించి వాటర్ ట్యాంక్‌తో నీళ్లు కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అందుకే కేసీఆర్ అంటే నీళ్లు, కాంగ్రెస్ అంటే కన్నీళ్లని తాము ఎప్పటినుంచో చెబుతున్నామని గుర్తుచేశారు. మిషన్ భగీరథను సక్రమంగా నిర్వహించడం ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని చెప్పారు. అబద్ధాల పునాదులపైనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి ధన వనరులను ఢిల్లీకి తరలిస్తున్న శ్రద్ధ జనవనరులను తరలించడంపై లేదన్నారు. ఇవాళ తాగునీళ్ల కోసం అడుక్కోవాల్సి దుస్థితిని ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. హైదరాబాద్‌లో మళ్లీ ఇన్వర్టర్లు, జనరేటర్లు వచ్చాయన్నారు. కాళేశ్వరంపై నోటికొచ్చినట్లు విషప్రచారం చేశారని, కేసీఆర్ జనగామ, సూర్యాపేట వెళ్లగానే అదే కాళేశ్వరం నుంచి జలాలను విడుదల చేశారని చెప్పారు. కాళేశ్వరం పంపులను ఆన్ చేసి, మేడిగడ్డ మరమ్మతులు చేస్తే రైతులకు ఈ దుస్థితి ఉండేదా అని ప్రశ్నించారు. హరీశ్ రావు మల్లన్న సాగర్ నీటి కోసం అల్టిమేటం ఇస్తే వెంటనే విడుదల చేశారన్నారు. కాళేశ్వరం నీటిని కొండపోచమ్మ వరకు తీసుకురావచ్చని చెప్పారు. పుష్కలంగా నీళ్లుంటే ట్యాంకర్లు ఎందుకు కొనక్కోవాల్సి వచ్చిందన్నారు. పంటలు పండితే బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే కాంగ్రెస్ సాగునీళ్లవ్వడం లేదని ఆరోపించారు. నీళ్ల ట్యాంకర్లను ఫ్రీగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయ కుట్రతో ప్రజల కనీస అవసరమైన తాగునీళ్లు ఇవ్వకుండా చేశారని విమర్శించారు. బెంగళూరులో నీటి వృథాకు జరిమానా విధించాలని అక్కడి ప్రభుత్వం అంటున్నదని, ఇక్కడ వంద రోజులుగా నీళ్లను ఎత్తిపోయకుండా ఉన్న ఈ ప్రభుత్వంపై ఏం జరిమానా విధించాలని ప్రశ్నించారు. తాము అధికారం నుంచి దిగిపోయేనాటికి ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీళ్లున్నాయని చెప్పారు. ప్రజల నుంచి ముక్కు పిండేలా బిల్లులు వసూలు చేయరాదని, ఆత్మహత్య చేసుకున్న రైతులకు రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 218 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, వారి వివరాలు ఈ రోజే ముఖ్యమంత్రికి అందిస్తామన్నారు. ఎలాంటి ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. అప్రతిష్టపాలు చేసేవారిపై లీగల్‌గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 2011 నుంచి జరిగిన ఫోన్ ట్యాపింగ్ ఆధారాలు అన్ని బయటపెట్టాలన్నారు. అప్పుడు తెలంగాణ ఉద్యమంలో ఫోన్ ట్యాపింగ్ చేసింది ఇప్పుడున్న అధికారులేనని చెప్పారు. 2011లో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఆంధ్ర సీఎం, తెలంగాణ ఎమ్మెల్యేల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని ఇప్పుడున్న కాంగ్రెస్ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్వయంగా చెప్పారని తెలిపారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటి నుంచి ఫోన్ ట్యాపింగ్ మీద ఆధారాలు తిస్తే ఎవరి బొక్కలు ఏంటో తెలుస్తాయన్నారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి, మరో పార్టీలో చేరి మళ్లీ పోటీ చేయడం రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందన్నారు. పార్టీ మారిన కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై కచ్చితంగా కోర్టుకు వెళ్లామన్నారు. స్టేషన్ ఘన్‌పూర్, ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక ఖాయమన్నారు. మందకృష్ణ మాదిగ కూడా ఇదే విషయం మాట్లాడారని చెప్పారు. ప్రతి భారతీయుడు పెరిగిన ముడి చమురు ధరల గురించి ఆలోచించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. క్రూడాయిల్ ధరలు 2014 నుంచి తగ్గాయని.. కానీ మన దేశంలో ఇదే దశాబ్దంలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ.35, రూ.40 చొప్పున పెరిగాయనిన్నారు. దీనికి ఎవరిని నిందించాలి? నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు ఎవరు బాధ్యత వహించాలని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. పోలీసుల అదుపులో వేణుగోపాల్‌రావు

- 11 గంటల పాటు సుదీర్ఘ విచారణ
- నేడో రేపో అరెస్టు ప్రకటించే చాన్స్
- ఏడేళ్లుగా ఎస్ఐబీలో ఓఎస్డీగా..
- వారంపాటు కస్టడీకి రాధాకిషన్ ఆయనపై కూకట్‌పల్లిలో కేసు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్ సిటీ-ఏప్రిల్ 3:** ఎస్ఐబీ కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ అదనపు ఎస్పీ వేణుగోపాల్‌రావును పంజాగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదనపు ఎస్పీ హోదాలో రిటైర్ అయ్యాక.. ఆయన ఎస్ఐబీలో ఓఎస్డీ హోదాలో పనిచేయడం గమనార్హం..! బుధవారం ఉదయమే ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. సాయంత్రం 5 గంటల వరకు విచారించారు. ఈ సందర్భంగా ఆయన నుంచి కీలక సమాచారాన్ని రాబట్టినట్లు తెలిసింది. ట్యాపింగ్ చేసిన తీరును వేణుగోపాల్ వివరించినట్లు సమాచారం. ఇటీవల అరెస్టయిన టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును విచారించిన సందర్భంలో వేణుగోపాల్ పేరు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే..! ఎన్నికల సమయంలో ఏర్పాటు చేసిన 'స్పెషల్ టాస్క్' టీంలలో.. వేణుగోపాల్ సైబరాబాద్ బృందాలకు నేతృత్వం వహించినట్లు రాధాకిషన్ రిమాండ్ రిపోర్ట్ చెబుతోంది.

**నేటి నుంచి పోలీసు కస్టడీకి రాధాకిషన్..**

ఈ కేసులో అరెస్టయిన రాధాకిషన్‌రావును ఏడు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ నాంపల్లి న్యాయస్థానం బుధవారం తీర్పునిచ్చింది. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌ను పంజాగుట్ట పోలీసులు గురువారం ఉదయం కస్టడీకి తీసుకోనున్నారు. ఈ కేసులో గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ కోసం ఎన్నికల్లో నగదు తరలింపు, ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కీలక అంశాలపై ఆయనను ప్రశ్నించే అవకాశాలున్నాయి.

# భారీ భూకంపం

(మొదటి పేజీ తరువాయి..)

శిథిలాల కింద చిక్కుకున్నారని వివరించింది. భూకంపం కారణంగా తైవాన్ తూర్పు జిల్లాల్లో రాకపోకలు స్తంభించిపోయాయి. కొండచరియలు విరిగిపడి ఏకంగా ఓ భారీ బ్రిడ్జి కూలిపోయింది. ఓ వంతెనపై భారీగా వాహనాలు నిలిచిపోవడం.. ఆ బ్రిడ్జ్ ఊగుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరలైంది. హువాలియన్ నగరంలో 26 ఇళ్లు కూలిపోయాయని, రెండు భవనాలు పక్కకు ఒరిగిపోయాయని తైవాన్ అగ్నిమాపక శాఖ వెల్లడించింది. "మృతుల్లో కాలినడకన వెళ్తున్న వారు ముగ్గురు ఉన్నారు. మరో ఇద్దరు రోడ్డు టన్నెల్స్ పెచ్చులు కూలి చనిపోయారు. టారోకో నేషనల్ పార్క్ వద్ద ముగ్గురు పర్యాటకులు, పార్క్‌కు చెందిన ఓ వ్యాన్ డ్రైవర్ ఉన్నారు" అని పేర్కొంది. తూర్పు జిల్లాల్లో భూకంప తీవ్రత 7.2గా ఉండగా.. భూకంప కేంద్రం (హువాలియన్ కౌంటీ) వద్ద 6గా నమోదైనట్లు వాతావరణ శాఖ వివరించింది. తైవాన్ వ్యాప్తంగా భూమి కంపించిందని తెలిపింది. దేశవ్యాప్తంగా రైళ్ల సేవలను నిలిపివేశామని, సబ్‌వేలను మూసివేశామని వెల్లడిం చింది. భూగర్భంలో 15.5 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రకం ఉందని, దీని ప్రభావం పొరుగు దీవుల్లోనూ కనిపించిందని తైవాన్ భూకంప కేంద్రం డైరెక్టర్ వూచియెన్‌ఫూ వెల్లడించారు. కాగా.. ఈ భూకంప తీవ్రత 7.4గా ఉన్నట్లు అమెరికా జియలాజికల్ సర్వే అధికారులు ప్రకటించారు.



# ఏనుగు దాడిలో రైతు మృతి

(మొదటి పేజీ తరువాయి..)

భూముల్లోకి చొరబడింది. అక్కడే ఉన్న ఓ రైతుపై దాడి చేయగా, తీవ్రంగా గాయపడిన రైతు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం బూరెపల్లి సమీపంలోని ప్రాణహిత నదిలో ఏనుగును గ్రామస్తులు కొంతమంది గమనించారు. ప్రాణహిత నది నుంచి బూరెపల్లి వ్యవసాయ భూముల వైపు వెళ్లింది. ఆ సమయంలోనే గ్రామ శివారులోని మిరపతోటలో అల్లూరి శంకర్(55) భార్య సుగుణబాయి, మరికొందరితో కలిసి పనులు చేసుకుంటున్నాడు. ఏనుగు రాకను గమనించిన సుగుణ బాయి భర్తతోపాటు కూలీలను అప్రమత్తం చేస్తూ పరుగెత్తింది.

తోట నుంచి వెళ్లలేకపోయిన శంకర్ అక్కడే ఓ చోట దాక్కున్నాడు. నేరుగా అక్కడికే వచ్చిన ఏనుగు శంకర్‌ను తొండంతో పైకి లేపి విసిరింది. ఎగిరి కింద పడిన అతడిని మళ్లీ కాలితో తొక్కడంతో గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఏనుగు అక్కడి నుంచి బాబాపూర్ వైపు వెళ్లడంతో కుటుంబసభ్యులు శంకర్ మృతదేహం వద్దకు వెళ్లారు. శంకర్‌కు నలుగురు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ.10వేలు అందించారు. చిక్కని ఏనుగు: కౌటాల సీఐ సాదిక్ పాషా, ఖర్జెల్లి రేంజ్ అధికారి చంద్రమౌళి ఆధ్వర్యంలో బృందాలు ఏనుగును అనుసరించాయి. గంగాపూర్ నుంచి ప్రాణహిత%--%చేవెళ్ల ప్రాజెక్టు కాలువల మీదుగా ఖర్జెల్లి వైపు వెళ్లినట్లు గుర్తించారు. ఖర్జెల్లి గ్రామస్తులు ఏనుగు గ్రామం వైపు రాకుండా మంటలు పెట్టారు. రాత్రి కావడంతో ఏనుగు వెళుతున్న మార్గాల్లోని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. రాకపోకలు నిలిపివేశారు. రాత్రి పది గంటల వరకు రుద్రాపూర్ సమీపంలో ఏనుగు ఉన్నట్లు గుర్తించారు.

**రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా: మంత్రి కొండా సురేఖ**

ఏనుగు దాడిలో అల్లూరి శంకర్ మృతి చెందడం పట్ల మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ మొత్తాన్ని వెంటనే అందజేస్తామన్నారు.

# నాలుగు నెలలవుతున్నా రుణమాఫీ ఊసేది

(మొదటి పేజీ తరువాయి..)

ప్రకటించినట్టుగా రుణమాఫీ జరగలేదు. మీరు అధికారంలోకి వచ్చి దాదాపు 4 నెలలు కావొస్తున్నది. అయినప్పటికీ ఒక్క రైతుకు కూడా ఒక్క రూపాయి రుణ మాఫీ కాలేదు. బ్యాంకులు మాత్రం రైతులకు నోటీసుల మీద నోటీసులు ఇస్తున్నాయి. ప్రభుత్వ హామీతో తమకు సంబంధం లేదని, తీసుకున్న అప్పుకు వడ్డీతో సహా కిస్తీలు చెల్లించి తీరాల్సిందేనని ఒత్తిడి తెస్తున్నాయి. ఉమ్మడి వరంగల్, ఉమ్మడి మెదక్ జిల్లాలో వందలాది మంది రైతులకు బ్యాంకు నోటీసులు అందాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తీసుకున్న అప్పుకు వడ్డీ మీద వడ్డీ పెరిగి రైతులపై పెను ఆర్థిక భారం పడుతున్నది. బ్యాంకులు రైతులను డిఫాల్టర్ల జాబితాలోకి ఎక్కిస్తున్నాయి. సిబిల్ రేటింగ్ కూడా దారుణంగా పడిపోతున్నది. రైతుల పిల్లలు చదువు కోసం విద్యారుణాలు తో పాటు ఇతర రుణాలు పొందలేక పోతున్నారు. ఈ సమస్యలతో రైతులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కేసీఆర్ నాయకత్వంలో రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ రెండు సార్లు రూ.లక్ష చొప్పున 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసింది. ఏ ఒక్క బ్యాంకు కూడా రుణాలు చెల్లించాలని ఎప్పుడూ రైతులపై ఒత్తిడి తీసుకురాలేదు. లక్ష రూపాయల వరకు రైతులకు సంబంధించిన రుణాలను మేమే కడతామని బ్యాంకర్లకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందస్తు హామీ ఇచ్చింది. దాని ప్రకారమే ప్రభుత్వ ఖజానా నుంచి బ్యాంకులకు చెల్లింపులు చేసింది. ఫలితంగా లక్షలాది మంది రైతులు ఎలాంటి ఇబ్బందీ లేకుండా రుణమాఫీ పొందగలిగారు. కానీ రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి విధానమూ ప్రకటించక పోవడం, ఈ బ్జడెట్ లో రుణమాఫీ ప్రస్తావన లేకపోవడం వల్ల రాష్ట్రంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. రుణమాఫీపై ప్రభుత్వం నేటివరకు అటు బ్యాంకర్లకు కానీ, ఇటు రైతులకు కానీ ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు. రుణాలు మేమే చెల్లిస్తామని, రైతులపై ఒత్తిడి తేవొద్దని బ్యాంకర్లను ప్రభుత్వం ఆదేశించలేదు. ఎవరైనా రైతులు వడ్డీ భారం పడకుండా రుణాలు చెల్లిస్తే వారికి ప్రభుత్వం తిరిగి నగదు ఇస్తుందా, లేదా? అనే విషయంపైనా స్పష్టత లేదు. ఈ అనిశ్చితి.. గ్రామాల్లో రైతులకు, బ్యాంకర్ల మధ్య చిచ్చు పెడుతున్నది. స్థానిక బ్యాంకు మేనేజర్లకు వారి ఉన్నతాధికారుల నుంచి లోన్ రికవరీ కోసం నోటీసులు వస్తున్నాయి. దీంతో వారు రైతుల మీద పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఏ హామీని కూడా అమలు చేయకపోవడం వల్ల వారు ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందక, పంటలు ఎండిపోయి, సకాలంలో నీళ్లు అందక, ఈ నాలుగు నెలల కాలంలో 209 మంది అన్నదాతలు చనిపోయారు. రుణమాఫీ విషయంలో బ్యాంకర్ల ఒత్తిళ్లకు, వేధింపులకు తట్టుకోలేక రైతులు ప్రాణం తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. రుణమాఫీ విషయంలో మీరు తక్షణం స్పందించాలని డిమాండ్ చేస్తున్నాను. 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీని ఎప్పట్లోగా చేస్తారో స్పష్టమైన తేదీ ప్రకటించాలని రైతుల పక్షాన కోరుతున్నాను. రైతుల రుణాలను ప్రభుత్వమే చెల్లిస్తుందని బ్యాంకర్లకు హామీ పత్రం రాసివ్వాలని విన్నవించుకుంటున్నాను. దేశానికి అన్నం పెట్టే రైతుకు భరోసా ఇవ్వడం ప్రభుత్వ కనీస బాధ్యతని తెలిపారు. తెలంగాణ వ్యవసాయిక రాష్ట్రం. వ్యవసాయం మీద ఆధారపడిన కుటుంబాలు 70 శాతం వరకు ఉన్నాయి. అత్యధిక సంఖ్యలో ఉన్న రైతులను గోస పెట్టడం ఏమాత్రం సమ్మతం కాదు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదన్న పెద్దల మాట మీకు నేను గుర్తు చేయాల్సిన అవసరంలేదు. రైతుల బాధలు, కష్టాలు, కన్నీళ్లు తొలగించే విధంగా.. మీరిచ్చిన హామీలన్నిటినీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాను. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు, పంట మద్దతు ధరపై 500 రూపాయల బోనస్, ఎకరానికి 15 వేల చొప్పున పెట్టుబడి సాయం, పంట పొలాలకు నీళ్లు, 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తున్నాను.' అని లేఖలో పేర్కొన్నారు.

# వేసవి ఎండల్లో అగ్నిప్రమాదాలు

- అడవుల్లో మంటలు చెలరేగకుండా చర్యలు
- ముందస్తు హెచ్చరిక చేసిన అధికారులు

**నేటి ఫోకస్ న్యూస్, ఆదిలాబాద్-ఏప్రిల్3:** వేసవి ఎండలు తీవ్రం అవుతున్నందున అగ్నిప్రమాదాలు జరక్కుండా గ్రామాల్లో జాగ్రత్తలు పాటించాలని అధికారులు క్షేత్రస్థాయిలో అధికారులను ఆదేశించారు. అలాగే అడవుల్లో మంటలు చెలరేగకుండా అటవీ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. రైతులు వరి పొలాల్లో చెత్తను కాలబెట్టే సమయంలో సమీప అటవీ సంపదకు నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. వేసవి కాలంలో అటవీ సంపద అగ్నికి ఆహుతి అవుతుందని, దానిని కాపాడేందుకు స్థానిక వీఆర్వోలు చర్యలు తీసుకోవాలని గ్రామ సంరక్షణ కమిటీలు, వీఆర్వోలు గ్రామంలోని వారందరికీ అటవీసంపద కాపాడుకునే అంశాన్ని వివరించాలన్నారు. ఇకపోతే ఎండాకాలంలో విద్యుత్ వైర్లు ఒకదానికొకటి రాపిడి కావడంతో నిప్పురవ్వలు ఎగిసి పడి ఎండిన ఆకులపై పడి మంటలు వ్యాపించే అవకాశాలు కూడా ఉన్నాయి.

# ఖమ్మం కాంగ్రెస్‌లో ఎంపీ టికెట్ ముసలం

- టిక్కెట్ చిక్కుముడి విప్పేదెలా
- సీటు కోసం ముగ్గురు మంత్రుల పట్టు
- ఎటూ తేలని ఖమ్మం ఎంపి పంచాయితీ

**నేటి ఫోకస్ న్యూస్, ఖమ్మం-ఏప్రిల్ 3:**


ఖమ్మం కాంగ్రెస్‌లో ఎంపీ టికెట్ ముసలం పుట్టించింది. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు తమ కుటుంబసభ్యులకు టికెట్ ఇప్పించుకొనేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దీంతో జిల్లాకు చెందిన ఇతర కాంగ్రెస్ నేతలు గుర్రుగా ఉన్నారు. ఎంపీ సీటు కూడా మంత్రుల కుటుంబాలకే ఇస్తే ఇక తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలా ఖమ్మం లోక్‌సభ సీటుకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక విషయమై పీటముడి పడింది. ఇది తేలడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. పార్టీలో చేరే సమయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఇచ్చిన హామీ మేరకు ఆయన సోదరుడికి టికెట్ ఇవ్వాలని కొందరు, ప్రభుత్వంలో ముఖ్య స్థానాల్లో ఉన్న వారి కుటుంబ సభ్యులకు కాకుండా వేరొకరికి అవకాశమివ్వాలని మరికొందరు ప్రతిపాదిస్తున్న నేపథ్యంలో ఈ సీటుపై నిర్ణయం తీసుకోవడానికి మరో ఐదారు రోజులు పట్టవచ్చని తెలుస్తోంది. సోమవారం జరిగిన కాంగ్రెస్ ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశానికి రాహుల్ గాంధీ హాజరుకాకపోవడంతో ఆయనతో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నారు. కరీంనగర్, హైదరాబాద్ లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల విషయమై దాదాపు నిర్ణయానికి వచ్చినా.. ఖమ్మం అభ్యర్థి ఎంపిక ప్రభావం కరీంనగర్ అభ్యర్థిపై పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌కు పార్టీ జిల్లా అధ్యక్షుడు షమీర్ ఉల్లా పేరును ఖరారు చేసినట్లు సమాచారం. కరీంనగర్ స్థానానికి పలువురు పోటీ పడినా మొదటి నుంచీ రేసులో ఉన్న ప్రవీణ్‌రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావుల పేర్లే తుది పరిశీలనకు వచ్చినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ సీటును పొన్నం ప్రభాకర్‌కు ఇచ్చినప్పుడు ప్రవీణ్‌రెడ్డికి ఎంపీగా పోటీకి అవకాశం ఇస్తామని పార్టీ హామీ ఇచ్చింది. ఈ మేరకు ఆయన పేరునే ఖరారు చేసినా, ఖమ్మం అభ్యర్థి ఎవరో తేలిన తర్వాత సామాజిక సమీకరణాలను కూడా పరిగణనలోకి తీసుకొని కరీంనగర్ అభ్యర్థిని ఎంపిక చేస్తారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి టికెట్లు ఇచ్చారని, ఇప్పుడు కూడా అదే జరిగితే తాము ఎప్పటికీ ఇలాగే ఉండాలా? అని పాత కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే పంథాను అనుసరించడం పార్టీకి మంచిది కాదని సూచిస్తున్నట్టు తెలిసింది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న కాంగ్రెస్ హైకమాండ్ కూడా ఈ ముగ్గురికి కాకుండా ఈసారి వేరే వ్యక్తికి ఇవ్వడమే సరైన నిర్ణయమని భావిస్తున్నట్లు సమాచారం. ఖమ్మం ఎంపీ అభ్యర్థిత్వంపై నేడో, రేపో, తుది నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్రంలోనే చైతన్యవంతమైన ఓటర్లు ఉన్న ఖమ్మం జిల్లాలో ఎంపీ సీటు కోసం మహామహులు పోటీపడుతున్నారు. తమ వారికి టికెట్ ఎలాగైనా ఇప్పించుకోవాలని జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఈ సీటు విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన భార్య నందిని కోసం, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన సోదరుడు ప్రసాద్ రెడ్డి కోసం, మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన కుమారుడి కోసం పోటీపడుతున్నారు. అయితే.. తమకు అందిన అభ్యర్థుల జాబితాను పరిశీలించిన కాంగ్రెస్ అధిష్టానానికి.. ఖమ్మం అభ్యర్థి ఎంపిక కొంత ఇబ్బందికరంగా మారినా.. అంతిమంగా సామాజిక సమీకరణల ఆధారంగా టిక్కెట్ కేటాయించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ముగ్గురు మంత్రులలో ఏ ఒక్క కుటుంబానికి సీటు కేటాయించినా అంతర్గతంగా పార్టీ ప్రయోజనాలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని భావించిన అధిష్టానం, ప్రత్యామ్నాయ అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. రాజకీయంగా ఇప్పటికే మంత్రి పదవులను అనుభవిస్తున్న వారి కుటుంబాలకు ఎంపీ టిక్కెట్ కేటాయించడం వల్ల సాధారణ ఓటర్లకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఏఐసీసీ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఎలాంటి విమర్శలకు తావు లేకుండా సామాజిక సమీకరణల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఖమ్మం ఎంపీ అభ్యర్థి ఎంపిక విషయంలో ఇంతకాలం ఆలస్యం కావడానికి కూడా ఇదే కారణమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు గత నాలుగు దశాబ్దాల కాలంగా ఖమ్మం ఎంపీ స్థానంతోపాటు ఆ పరిధిలో ఉన్న అసెంబ్లీ స్థానాలలో సైతం ఓసీలకు, ఎస్సీలకు, ఎస్టీలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కింది. అయితే.. ప్రాతినిధ్యం విషయంలో తమకు ఇంత వరకూ ఏ మాత్రం న్యాయం జరగలేదన్న తీవ్ర అసంతృప్తి బీసీల్లో నెలకొంది. ఈ నియోజకవర్గంలో మొత్తం 16 లక్షలకు పైగా ఓటర్లు ఉండగా.. అందులో దాదాపు 9 లక్షలు బీసీ ఓటర్లున్నారు. ఈ నేపథ్యంలో ఖమ్మం పార్లమెంట్ స్థానానికి దరఖాస్తు చేసుకున్న బీసీ అభ్యర్థుల పేర్లను అధిష్టానం క్షుణ్ణంగా పరిశీలించినట్టు తెలిసింది. అందులో యాదవ సామాజిక వర్గానికి చెందిన నాగ సీతారాములు పేరును పలువురు సీనియర్ నేతలు సూచించినట్టు సమాచారం. ఖమ్మం ఎంపీ నియోజకవర్గ పరిధిలో మూడున్నర లక్షలకుపైగా యాదవ ఓటర్లు ఉండడంతోపాటు ఆయన వివాదరహితుడని, పార్టీని అంటిపెట్టుకుని పని చేస్తున్నాడని, అతనిపై అధిష్టానం సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది. రేపు జరగనున్న సీఈసీ సమావేశంలో అతని అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయనున్నట్లు ఏఐసీసీ వర్గాల ద్వారా తెలిసింది. ఖమ్మం లోక్‌సభ సీటుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుమారుడు యుగంధర్‌తో పాటు పారిశ్రామికవేత్త రాజేంద్రప్రసాద్ తదితరులు పోటీపడ్డారు. ప్రభుత్వంలోని ముఖ్యుల కుటుంబ సభ్యులను మినహాయిస్తే బాగుంటుందనే చర్చ నేపథ్యంలో మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి కుమారుడు రఘురామిరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. మొదటి నుంచీ కాంగ్రెస్‌లో ఉండి రాజకీయంగా గుర్తింపు పొందిన కుటుంబం కావడంతో ఈయన పేరును ప్రతిపాదిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు రాష్ట్రంలోని ముఖ్యనేత కూడా సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. పొంగులేటికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ గురించి సోమవారం నాటి సీఈసీ సమావేశంలో కమిటీ ఛైర్మన్ హరీష్ చౌధరి ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పొంగులేటి పార్టీలో చేరే సమయంలో హామీ ఇచ్చిన మేరకు సీట్లు ఇవ్వలేకపోయామని, ఆయన రావడం వల్లే మరికొందరు కూడా పార్టీలో చేరారనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. నందిని, ప్రసాదరెడ్డిల అభ్యర్థిత్వాల విషయమై కూలంకషంగా చర్చించినా.. రాహుల్‌గాంధీతో చర్చించిన తర్వాత ఖరారు చేయాలని నిర్ణయించారు. ముఖ్యనేతల కుటుంబ సభ్యులకు కాకుండా వేరే వారికి ఇవ్వాలనుకుంటే రఘురామిరెడ్డి పేరే ప్రధానంగా ఉండే అవకాశం ఉందని, మరో సామాజికవర్గానికి సీటు కేటాయించే అవకాశమూ లేకపోలేదని పార్టీ సీనియర్ నాయకుడొకరు తెలిపారు. కరీంనగర్ లోక్‌సభకు ప్రవీణ్‌రెడ్డి పేరును దాదాపు ఖరారు చేసినా ఖమ్మం పీటముడి వీడే వరకు ప్రకటించే అవకాశం లేదని తెలిసింది. ఖమ్మంలో ప్రసాద్‌రెడ్డి లేదా రఘురామిరెడ్డికి ఇస్తే కరీంనగర్ అభ్యర్థి ఎంపికపై మళ్లీ చర్చ జరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ అభ్యర్థిని కూడా ఆ రెండు స్థానాలతో పాటే ప్రకటించ వచ్చని భావిస్తున్నారు. ఈ నెల ఆరున తుక్కుగూడ బహిరంగసభలో పాల్గొనడానికి రాహుల్‌గాంధీ రానున్నందున ఆ రోజు ఖమ్మం అభ్యర్థిత్వంపై ఆయనతో చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# మోడీ నియంతృత్వాన్ని అడ్డుకుందాం

## వరంగల్‌లో కడియం కావ్యకు మద్దతు ఇవ్వండి

## సీపీఐ నాయకులను కోరిన రేవూరి, కడియం శ్రీహరి

**నేటి ఫోకస్ న్యూస్,హనుమకొండ-ఏప్రిల్3:**



దేశంలో రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ, ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తూ నియంతృత్వ పాలనను కొనసాగించిన నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయానికి విచ్చేసి ఇండియా కూటమిలో ఉన్న సీపీఐ మద్దతు కోరుతూ సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులను కలిశారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత గత పదేళ్లలో దేశ ఆర్థిక వనరులను కార్పొరేట్, పెట్టు బడి దారులకు దోచి పెట్టడమే పనిగా పెట్టుకున్నారని, హిందూత్వ వాదం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నారని అన్నారు. తమ మాట వినని వారిపై సీబీఐ, ఈడీ, ఐటీ లాంటి సంస్థలను ప్రయోగిస్తూ ప్రశ్నించే గొంతులు లేకుండా చేస్తున్నారని, మరోవైపు దళితులు, మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగాయని అన్నారు. ఈ క్రమంలోనే దేశంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలతో సహా ప్రాంతీయ పార్టీలతో కలిసి ఇండియా కూటమిగా ఏర్పడడం జరిగిందన్నారు. ఈ రోజు కూటమి అభ్యర్థిగా కాంగ్రెస్ నుండి పోటీ చేస్తున్న విద్యావంతురాలు కడియం కావ్యకు మద్దతు కోసం సీపీఐ, సీపీఎం నాయకులను కోరడం జరుగుతున్నదని చెప్పారు. కడియం శ్రీహరి ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకులుగా ఎమ్మెల్యే, ఎంపీ, డిప్యూటీ సీఎం గా పని చేశారని, కొందరు స్వార్థ పరులే ఆయనపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. మంద క్రిష్ణ లాంటి వ్యక్తి తన వర్గ ప్రయోజనాల కోసం పోరాడకుండా బీజేపీకి ఏజెంట్‌గా మారి మాదిగలకు ద్రోహం చేయాలని చూస్తున్నాడని విమర్శించారు. దళితులు, మైనార్టీలపై దాడులు చేసే బీజేపీకి వంత పాడుతూ మతతత్వ వాదాన్ని పెంచుతున్నాడని అన్నారు. మరోవైపు బీఆర్ఎస్ నాయకులు కూడా బీజేపీ కే పరోక్షంగా మద్దతు తెలుపుతూ కడియం పై విమర్శిస్తున్నారని అన్నారు. అలాగే రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, కేసీఆర్ పైత్యం వల్లే కాళేశ్వరం రీడిజైనింగ్ జరిగి పనికి రాకుండా పోయిందని అన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ముందుకు సాగుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు తెలిపారు. బీజేపీ పాలనలో గడిచిన పదేళ్లలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను పెంచి సామాన్య ప్రజల జీవితాలపై పెనుభారం మోపారని అన్నారు. తమ ప్రధాన లక్ష్యం బీజేపీ ఓటమే నని బీజేపీకి వంత పాడుతున్న బీఆర్ఎస్ ను కూడా పార్లమెంటు ఎన్నికలలో ఓడిస్తామని అన్నారు. ఇండియా కూటమి అభ్యర్థిగా కడియం కావ్య గెలిస్తేనే విభజన హామీలైన బయ్యారం ఉక్కు, కాజీపేట రైల్వే పరిశ్రమలు సాధ్యమని అన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. విజయ సారథి,ఎన్. జ్యోతి,మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె బిక్షపతి, మేకల రవి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, నాయకులు పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, షేక్ బాష్ మియా, పి. సుగుణమ్మ, తోట బిక్షపతి, మ్దదెల ఎల్లేష్, బీఆర్ లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిగా గెలిపిస్తే ఢిల్లీలో మన వాణి వినిపిస్తా

- పేదల కోసం అంకితభావంతో పనిచేస్తా
- బిఆర్ఎస్ నాగర్ కర్నూల్ అభ్యర్థి ఆర్ఎస్‌పి

**నేటి ఫోకస్ న్యూస్, నాగర్‌కర్నూల్-ఏప్రిల్3:**

ఎంపీగా అవకాశం కల్పిస్తే నాగర్‌కర్నూల్ వాణిని ఢిల్లీలో వినిపిస్తానని, పేద ప్రజల అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేసి చూపిస్తానని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం వనపర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, సీనియర్ నాయకుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇంతకుముందు ఇక్కడి నుంచి ఎన్నికైన ఎంపీలంతా పార్లమెంట్లో మౌనంగా ఉన్నారు. ఇలాంటి వ్యక్తుల వల్ల నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలందరికి నష్టం కలుగుతుందన్నారు మల్లురవి, పోతుగంటి భరత్ వల్ల ఎలాంటి ఉపయోగం లేదని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పని చేయడం గర్వంగా ఉందన్నారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వెయ్యి గురుకులాలను ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని ప్రశ్నించారు. గురుకులాల ద్వారా లక్షలాది మంది పేద విద్యార్థులు ప్రపంచ స్థాయిలో చదువుకొని ఉద్యోగాలు చేస్తు న్నారని గుర్తు చేశారు. తెలంగాణ గురుకులాల గురించి అమెరికాలోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోనూ పాఠం ఉందంటే అది నాటి సీఎం కేసీఆర్ ప్రత్యేకత అన్నారు. అబద్ధపు ప్రచారాలను నమ్మవద్దు.. అప్రమత్తంగా ఉండి పార్లమెంట్ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదిలావుంటే సమస్యలపైన, సమాజం పట్ల పట్టు ఉన్న వ్యక్తి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌నుగెలిపించాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం నాగర్ కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను కాంక్షిస్తూ వనపర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు.

ఐపీఎస్ అధికారిగా ప్రవీణ్ కుమార్ ప్రజల కోరిక మేరకు పనిచేసి శభాష్ అనిపించుకున్నారు. బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు శ్రమించాలన్నారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కానీ హామీలే ఇచ్చింది. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన బండారం బయటపడుతుందన్నారు. కేవలం 100 రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో అభాసు పాలయిందన్నారు. హామీల అమలు చేయలేక ఎన్నికల కోడ్ అంటూ మంత్రులు తప్పించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రెండు జాతీయ పార్టీలు ఉద్యమ నేత కేసీఆర్ పై దండెత్తుతున్నాయి. కేంద్రంలో అధికారం పేరు చెప్పి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ తప్పించు కునే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండండి, భవిష్యత్ మనదేనని భరోసానిచ్చారు. పదేళ్లలో బీజేపీ పాలనలో రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మోసపోతాం. రూ.2 లక్షల రూపాయల రుణమాఫీ, రూ.4,000 పెన్షన్, తులం బంగారం ఇవ్వకపోయినా ప్రజలు అంగీకరించారు అంటారు. కాబట్టి, కాంగ్రెస్ పార్టీని ఓడగొట్టాలి. దీనిపైన ప్రతి గ్రామంలో చర్చ చేయాలన్నారు.

# రోహింగ్యాలకు అడ్డాగా తెలంగాణ

- మైనార్టీల కోసం ఉత్తమ్ వ్యాఖ్యలు
- మండిపడ్డ నిజామాబాద్ ఎంపి అర్వింద్

**నేటి ఫోకస్ న్యూస్, నిజామాబాద్-ఏప్రిల్3:**

రోహింగ్యాలకు తెలంగాణను అడ్డాగా మార్చాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అనుకుంటున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. కేంద్రం అమలు చేసిన సీఏఏ, ఎన్ఆర్సీ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయబోమని ఉత్తమ్ అధికారికంగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. కేవలం మైనార్టీ ఓట్ల కోసం కాంగ్రెస్ నేతలు సహనం కోల్పోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉత్తమ్ వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలు రాజ్యాంగాన్ని అవమానించేలా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. బుధవారం నాడు బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...తెలంగాణలో ఆర్టికల్ 786 తీసుకువచ్చే యోచనలో ఉన్నారా అని ప్రశ్నించారు. మంత్రి పదవిలో ఉండి ఉత్తమ్ ఈ తరహా వ్యాఖ్యలు ఎలా చేస్తారని నిలదీశారు. సత్వరమే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గతంలో బోధన్‌ను దొంగ పాస్‌పోర్టులకు అడ్డాగా మాజీ సీఎం కేసీఆర్ మార్చారని విరుచుకుపడ్డారు. ఉత్తమ్ గడ్డం పెంచినంత మాత్రాన సెక్యులరిజం కాదని.. అసలైన సెక్యులర్ పార్టీ బీజేపీ మాత్రమేనని ఎంపీ అర్వింద్ అన్నారు.

# పవన్‌కు తీవ్ర జ్వరం

- తెనాలి పర్యటన రద్దు..
- జ్వరం తగ్గాక షెడ్యూల్ విడుదల

**నేటి ఫోకస్ న్యూస్, గుంటూరు-ఏప్రిల్3:**

ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం తెనాలి పర్యటించాల్సిన పవన్ పర్యటన రద్దు అయింది.గత మూడు రోజులుగా పవన్ కల్యాణ్ జ్వరంతో బాధపడుతున్నారు. అయినా కొన్ని కార్యక్రమాల్లో పాల్గొనాల్సి వచ్చింది. ఇవాళ జ్వరం తీవ్రత ఎక్కువ కావడంతో హైదరాబాద్ తిరిగి వెళ్లిపోయారు. ఈ క్రమంలో బుధవారం తెనాలిలో జరగాల్సిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ పర్యటన రద్దు అయ్యింది. సాయంత్రం తెనాలిలో ర్యాలీ, సభల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. మంగళవారం ఇరవై కిలోమీటర్లు ఎండలో పవన్ పాదయాత్ర చేశారు. ఎండ వేడిమికి అస్వస్థతకు గురయ్యారు. ఇంకా పూర్తిగా జ్వరం తగ్గక పోవడంతో తెనాలి పర్యటనను పవన్ రద్దు చేసుకున్నారు. మళ్లీ తేదీ, సమయం ప్రకటిస్తామని జనసేన నేతలు తెలిపారు. ఏపీలో ఎండలు మండిపోతున్నాయి. అయినా లెక్క చేయకుండా పవన్ వారాహి విజయ భేరి యాత్ర నిర్వహిస్తున్నారు. ఆయన మండుటెండలో ఏకంగా 20 కిలో మీటర్ల పాటు పాదయాత్ర నిర్వహించారు. దీంతో ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర జ్వరంతో ఇబ్బంది పడుతున్నారు. ఆయనకు విశ్రాంతి అవసరమని వైద్యులు చెప్పడంతో నేటి తెనాలి పర్యటనను పవన్ రద్దు చేసుకున్నారు. జ్వరం తగ్గిన వెంటనే తిరిగి పర్యటన కొనసాగించనున్నారు. నాలుగు రోజుల క్రితమే అంటే పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తున్న సమయంలోనే పవన్ అస్వస్థతకు గురయ్యారని తెలుస్తోంది. అయినా లెక్కచేయక పర్యటనను కొనసాగించారు. ఇక ప్రస్తుతం ఆయన తీవ్ర జ్వరంతో బాధపడుతుండటంతో వైద్యుల సూచన మేరకు తన పర్యటనను రద్దు చేసుకున్నారు.

# రాధాకిషన్‌పై కూకట్‌పల్లిలో కేసు

**నేటి ఫోకస్ న్యూస్, కూకట్‌పల్లి, ఏప్రిల్ 3:**

టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుపై కూకట్‌పల్లి పోలీసస్టేషన్‌లో కేసు నమోదైంది. తనను టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో నిర్బంధించి, తన ఫ్లాట్‌ను బలవంతంగా రిజిస్టర్ చేయించుకొన్నారంటూ కూకట్‌పల్లి సప్తగిరికాలనీకి చెందిన సుదర్శన్ కుమార్ అనే వ్యక్తి కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2017లో రాజరాజేశ్వర కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన రాజా అనే బిల్డర్ సనత్‌నగర్ జెక్‌కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌ను నిర్మిస్తుండగా.. తాను రూ.60 లక్షలు పెట్టి, 10% వాటాదారుడిగా చేరినట్లు ఆయన వివరించారు. బిల్డర్ తన పేరిట ఓ ఫ్లాట్‌ను రిజిస్టర్ చేశారని, దాన్ని 2019లో తన కూతురి పేరిట సేల్‌డీడ్ చేయించానని పేర్కొన్నారు. కొంతకాలం తర్వాత బిల్డర్ రాజా తనకు ఫోన్‌చేసి, అదనంగా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, దానికి అంగీకరించడంతో.. అప్పటి టాస్క్‌ఫోర్స్ అధికారి రాధాకిషన్ ద్వారా తనను రెండ్రోజులు నిర్బంధించారని తెలిపారు. తమ ఫ్లాట్‌ను తిరిగి బిల్డర్ రాజా పేరిట రిజిస్టర్ చేయించారని.. లేని పక్షంలో బిల్డర్ రాజా తమను సుపారీ కిల్లర్స్‌తో హత్య చేయించే ప్లాన్‌లో ఉన్నాడని హెచ్చరించారన్నారు. దాంతో.. ఆ ఫ్లాట్‌ను బిల్డర్ రాజా పేరిట రిజిస్టర్ చేసినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాధాకిషన్ అరెస్టుతో ధైర్యం చేసుకుని, ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

# మోడీ హయాంలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- బిఆర్ఎస్ హయాంలోనే కరువు కాలం మొదలు
- బిఆర్ఎస్‌కు ఒక్కసీటూ రాదన్న మంత్రి ఉత్తమ్

**నేటి ఫోకస్ న్యూస్, సూర్యాపేట-ఏప్రిల్3:**

ప్రధాని మోదీ హయాంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని..మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. 75 ఏళ్ళ స్వాతంత్య్రం అనంతరం ఇలా జరగడం ఇదే ప్రథమమని అన్నారు. మరోసారి మోదీ అధికారంలోకి వస్తే దేశం ఇంకా ప్రమాదంలో పడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే ప్రజాస్వామ్యం బలపడుతుందని అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎంలను జైలుకు పంపు తున్నారని, ప్రతిపక్షాలను దర్యాప్తు సంస్థలతో ఇబ్బంది పెడుతు న్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అకౌంట్స్ ఫ్రీజ్ చేసి ఎన్నికల ప్రచార పక్రియకు ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. ఇకపోతే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీలోనే లేదని... వాళ్లకు సున్నా సీట్లంటూ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ మిగలదన్నారు. వారు ఎంతగా అవినీతికి పాల్ప డ్డారో నిత్యం చూస్తూనే ఉన్నామని అన్నారు. 13 -14 స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఉనికికి ప్రమాదం వచ్చిందని గుర్తించిన నేతలు కావాలనే కాంగ్రెస్‌పై అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దతు ధరకు కొనుగోలు చేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు.

# ఎన్నికల కోడ్‌తో ఆగిన పథకాలు

- ఎన్నికలయ్యాక ఇందిరమ్మ ఇళ్లు అందచేత
- పినపాక సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి బలరామ్

**నేటి ఫోకస్ న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం-ఏప్రిల్3:**

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని అందువల్ల కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు కొంత సమయం పడుతుందని మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ అన్నారు. ఎన్నికల కోడ్ అయిపోగానే పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని బలరాం నాయక్ అన్నారు. బుధవారం నాడు మణుగూరులో పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధ్యక్షతన కాంగ్రెస్ కార్యకర్తలకు పార్లమెంట్ ఎన్నికలపై దిశా నిర్దేశర చేశారు. ఈ సందర్భంగా బలరాం నాయక్ మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన 6 గ్యారెంటీ పథకాల్లో ఐదు పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ 10 ఏళ్లు అధికారంలో ఉన్న నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. పులుసుబొంత ప్రాజెక్ట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని అన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు పినపాక నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. మళ్లీ తనను ఎంపీగా గెలిపించాలని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. గుండాలలో రెండు బొగ్గుబావులు, ఐటీసీలో చెప్పుల ఫ్యాక్టరీ కోసం కృషి చేస్తానని తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని పోరిక బలరాం నాయక్ అన్నారు.